**కథ**

# అనగనగా...ఓ తండ్రి..!

**ఉదయం పది గంటలు దాటింది. వీధి వాకిట్లోని వేపచెట్టు కింద బండమీద కూర్చునివున్న రాజయ్య, తదేకంగా సందు మొదట్లోకి చూస్తున్నాడు. గంట క్రితం నోట్లో వేసుకున్న వేపపుల్ల ఇంకా నోట్లోనే నలగతా ఉంది.**

వారం రోజులుగా ఆయన దినచర్య అదే!

ఆయన ఎదురుచూపులు.. ఆ ఊరి పోస్ట్‌మేన్ కోసం!

''ఏంటయ్యో! ఇంకా ఆకలి కాలేదా? అట్టా ఎంతసేపని వాకిట్లో నిల్చోని ఎదురుచూస్తా ఉంటావ్! కార్డు ముక్కొస్తే ఆయనే తెచ్చిస్తాడుగా!'' అంటూ వాకిట్లోకి వచ్చింది భార్య సావిత్రమ్మ.

మౌనంగా విని, తలూపాడే తప్ప తూర్పొధి వంక చూడటం మానలేదు.

విసుగొచ్చి సావిత్రమ్మ తిరిగి ఇంట్లోకెళ్లిపోయింది ''ఈయన పిచ్చి ఈయనదే. చెపితే వింటాడేంటి?'' అనుకొంటూ.

అంతలో సైకిల్ మీద వస్తూ పోస్ట్‌మ్యాన్ కనిపించగానే రాజయ్యలో ఆతృత మొదలైంది.

''మీకేమీ జాబులు రాలేదు రాజయ్యా'' అంటూ పోస్ట్‌మ్యాన్ ముందుకు సాగిపోయాడు.

రాజయ్య ఉత్సాహం నీరుగారిపోయింది.

దిగాలుపడ్డ ముఖంతో లోపలకు వస్తున్న రాజయ్యతో ''ఎందుకయ్యా రోజూ అట్టా ఎదురుచూట్టం. రాసే వాడైతే ఎప్పుడో రాసుండేవాడు. అక్కడ వాడికెన్ని ఇబ్బందులో! తీరిక చూసుకొని వస్తాడులేయ్యా! ముందు పుక్కిలించి రాపో. చద్దికూడు పెడతా!'' అంది సావిత్రమ్మ.

మారు మాట్లాడకుండా నోరు పుక్కిలించి వచ్చి, చద్ది తిన్నాడు రాజయ్య.

''ఇదిగో ఇంక వాడు జాబు రాసేటట్టులేడు గానీ ఇట్టా ఎదురు చూసేకంటే నేనే ఓసారి వెళ్లి వాడితో మాట్లాడి వస్తాను'' కాసేపటి తర్వాత సావిత్రమ్మతో అన్నాడు.

''ఏంటి అంత దూరం వెళ్లొస్తావా! ఇంతవరకు నువ్వెప్పుడూ వాడి దగ్గరికి వెళ్లలేదు కదా! వాడి ఆఫీసుగానీ, ఇల్లు గానీ కనుక్కోగలవా?'' అంది.

''వాడి ఆఫీసు అడ్రసు ఉంది కదా! ప్రయత్నిస్తే దొరక్కపోదా... మరీ నన్నంత అమాయకుడ్ని చేయబాకే'' నవ్వుతూ అన్నాడు.

''సరే...నీ ఇష్టం..'' అందామె.

దాంతో రాజయ్య నేరుగా పట్నం వెళ్లి రాంబాబుని కలుసుకోవాలనే నిర్ణయానికి వచ్చాడు.

పక్కింటి సుభద్రమ్మ దగ్గర తన చెవికమ్మలు తాకట్టు పెట్టి, రెండు వందలు తెచ్చి ఇచ్చింది సావిత్రమ్మ.

తెల్లారి బస్సులో పట్నం బయలుదేరాడు రాజయ్య.

ఊరు దాటిన బస్సు పట్నం వైపు పరుగుతీస్తోంటే...రాజయ్య మనస్సు గతంలోకి పరుగుతీసింది!

తను నడిమిట్ట అగ్రహారంలో ఓ మధ్యతరగతి రైతు.

ఇద్దరు పిల్లలు... రాంబాబు, మాధవి. తనేం పెద్ద స్థితిమంతుడు కాకపోయినా పిల్లలిద్దర్నీ ఏ లోటూ రాకుండా పెంచాడు. మరీ రాంబాబునయితే కింద పెడితే చీమెత్తుకపోద్దేమో, పైనుంచితే కాకెత్తుకపోద్దేమోనని గుండెల మీద పెట్టుకొని పెంచాడు.

టెన్త్ అయిపోయిన తర్వాత కాలేజీ చదువులకు పట్నంలో చేర్పించాడు. తాము తిన్నా, తినకపోయినా క్రమం తప్పక రాంబాబుకు మెస్‌బిల్లులు, రూమ్‌కి అద్దె, పుస్తకాలకు, ఫీజులకు పంపించేవాడు.

చేతికందే ఫలితం, చేతికష్టం చాలకపోతే గుండె నిబ్బరంగా చేసుకొని పాడిగేదెల్ని, పంటపొలాలని కూడా తెగనమ్మి ఏ లోటూ రానీక రాంబాబుకు సొమ్ము సమయానికి అందించేవాడు.

కష్టాలు, నష్టాలు, బాధలు.. తనూ, తన భార్య కలసి భరించారే తప్ప. దాని తాలూకు ఛాయలు రాంబాబుకి ఏ సమయంలోనూ తెలియనిచ్చేవారు కాదు.

మాధవిని మాత్రం ఏడో తరగతితోనే చదువు ఆపించి, ఇంట్లో పనులకు సాయంగా ఉంచుకొన్నారు. ఈడొచ్చినాక... కొద్దిపాటి మెరకపొలం అమ్మి పెళ్లి చేసి, అత్తారింటికి పంపించివేశారు. తన అదృష్టం కొద్దీ మంచి అల్లుడే దొరికాడు కాబట్టి మాధవి గురించి దిగులులేదు.

గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన రాంబాబు పట్నంలోనే కోచింగ్ తీసుకుంటూ గ్రూప్ టెస్ట్‌లు రాయసాగాడు. కష్టపడి ప్రిపేర్ అయి ఆఫీసర్‌గా సెలక్ట్ అయ్యాడు. పట్నంలోని ఓ పెద్ద ఆఫీసులో పోస్టింగ్ ఇచ్చారు. తమ కొడుక్కి మంచి ఉద్యోగం దొరికినందుకు సంబరపడిపోయారు. తమ కష్టాలు తీరిపోయాయని సంతోషించారు.

పెద్దవాళ్లిచ్చిన ఆస్తిపాస్తులు రాంబాబు చదువుకీ, మాధవి పెళ్లికి ఖర్చయిపోగా తాము మిగిలిపోయారు. ఉంటున్న ఇల్లు తప్ప ఇంకేం మిగలలేదు.

చేతి కష్టం తప్ప మరేం తెలియని తమకి భవిష్యత్తు రాంబాబే!

పట్నం నుండి ప్రతీ నెలా రాంబాబు పంపించే సొమ్ముతో తాము బ్రతుకు వెళ్లదీయసాగారు.

''అక్కడ ఒక్కడివే ఎలా ఉంటావు మేము నీ దగ్గరే ఉంటాము'' అని సావిత్రమ్మ అంటే...

''అక్కడి వాతావరణంలో మీరు ఉండలేరు లేమ్మా! ఇరుకు ఇల్లు, గాలీ, నీరూ సరిగా ఉండదు. మీరిక్కడే హాయిగా ఉండండి. నా తిప్పలేవో నేనే పడతాను'' అంటూ సున్నితంగా తిరస్కరించాడు.

''మా బాబే'' తమ మీద ఎంత దయ అని సరిపెట్టుకున్నారు.

పట్నంలో ఉద్యోగం చేస్తూ తిండికి తిప్పలు పడుతున్న రాంబాబుకి పెళ్లి చేసేస్తే బాగుంటుందని తాము ఆలోచిస్తున్నంతలో ''నేను పట్నంలో నాతో పాటు ఆఫీసులో పనిచేసే రజని అనే ఆవిడ్ని పెళ్లి చేసుకోబోతున్నాను. ఆర్భాటాలేమీ లేకుండా రిజిస్టర్ పెళ్లి చేసుకుంటున్నాం. పెళ్లయినాక ఒకసారి తీసుకు వచ్చి చూపిస్తాను'' అన్నాడు.

ఆ మాట విన్న తామిద్దరూ షాకయ్యారు.

''అదేంటయ్యా ఒక్కగానొక్క అబ్బాయివి. నీ పెళ్లి ఈ ఊళ్లోనే పది మంది ముందర జరిగితే బాగుంటుంది'' అన్నాడు తను.

''ఎందుకు దండగ ఖర్చులు. పైగా రజనికి ఇష్టం లేదు'' అని ముక్తసరిగా ఆ సంభాషణ కట్ చేశాడు రాంబాబు.

చెప్పినట్లుగానే రజనిని రిజిస్టర్ మ్యారేజ్ చేసు


**తైపు ఆదిశేషారెడ్డి**

కొని, ఓ రోజు ఇంటికి తీసుకొచ్చాడు.

తమ ఇల్లూ, పరిసరాలు నచ్చలేదంటూ ఆవిడగారు ఇరవై నాలుగు గంటలు తిరక్కముందే, తన కొడుకిని కొంగునేసుకొని పట్నం వెళ్లిపోయింది.

వారు అలా వచ్చి, ఇలా వెళ్లిపోతే నోట మాట రాక నిలువు గుడ్లేసుకొని చూస్తుండి పోయారిద్దరూ.

''అదేంటి సావిత్రమ్మా! కోడలు పిల్ల నాలుగు రోజులైనా ఉండకుండానే వెళ్లిపోయిందే!'' అంటూ అడుగుతున్న చుట్టుపక్కల అమ్మలక్కలతో, ''పాపం పట్నంలో పెరిగిన పిల్లాయె! ఈ కొంపల్లో ఉండలేదని నేనే పంపించి వేశాను'' అని సర్ది చెప్పుకొంది పరువు పోకుండా, పొంగి వస్తున్న దుఃఖాన్ని గుండెల్లో అదిమిపెట్టుకొన్న సావిత్రమ్మ.



''గుండెల్లో పెట్టుకొని పెంచిన కొడుకు... గుండెల మీద తన్ని పెళ్లాంతో వెళ్లిపోయాడయ్యా'' అంటూ తనతో, గుండెలు బాదుకుంటూ అల్లాడింది సావిత్రమ్మ.

''వాళ్లు మన దగ్గర ఉండటం ఎలా కుదురుతుందే! వాళ్ల దారులు వారివి..! ఎక్కడో చోట సుఖంగా ఉంటే అదే చాలు..'' అంటూ ఆవిడ్ని ఓదార్చాడు.

ఆ తర్వాత.. మళ్లీ ఏనాడూ కోడలు తమ ఇంటిగుమ్మం తొక్కలేదు. రాంబాబు మాత్రం అప్పుడప్పుడూ వచ్చి, తమని పలకరించి పోతూ ఉండేవాడు.

కొంతకాలం బాగా జరిగింది గానీ ఆ తర్వాత కష్టాలు ప్రారంభమైనాయి!

నెలనెలా తమకి పంపించే సొమ్ములో కోత మొదలైంది.

మొదట్లో బాధపడినా తర్వాత తనూ సర్దుకొన్నాడు.

''వాడికీ పెళ్లాం వచ్చింది. పిల్లలు పుట్టారు. ఖర్చులు పెరుగుంటాయి కదా! మనం మాత్రం పూర్తిగా వాడిపైనే ఆధారపడితే ఎలా?'' అని భార్యకి సర్దిచెప్పాడు.

అందుకే లేని ఓపికను తెచ్చుకొని, చిన్నచితకా పనులకు పోసాగాడు.

సావిత్రమ్మ కూడా అడపాదడపా కూలిపన్లకు పోసాగింది.

వేన్నీళ్లకి, చన్నీళ్లలాగా తామూ కొంత సంపాదించుకుంటూ బ్రతుకు బండిని లాగదీయసాగారు. అంతా కలిపినా బ్రతకటానికి సరిపోతుందే గాని... పైసా మిగిల్చిన పాపాన పోలేదు!

అలా నెట్టుకొస్తున్న తమకి... 'గోరుచుట్టుపై రోకలిపోటు' అన్నట్లు కొత్త సమస్య వచ్చి పడింది!

సావిత్రమ్మకి ఆరోగ్యం దెబ్బతింది. ఊళ్లో వైద్యుడు ఇచ్చిన మందులేవీ పనిచేయటం లేదు.

''రాజయ్యా! నేను చేతనైనంత వైద్యం చేశాను. ఈ మందులకి ఏ మాత్రం నయం కనిపించటం లేదు. పట్నం తీసుకెళ్లి పరీక్షలు చేయించు. అసలు రోగమేంటో తెలుస్తుంది. అక్కడే మంచి మందులు ఇప్పించు'' అంటూ తేల్చి చెప్పేశాడు వైద్యుడు.

ఆ మాట విన్న తనకి దిక్కుతోచలేదు.

ఆమెకి వైద్యం చేయిం

చలేని తన నిస్సహాయతకు కుమిలిపోయాడు.

మరో మార్గం లేక అన్ని విషయాలు తెలియ జేస్తూ పట్నంలోని రాంబాబుకి ఉత్తరం రాశాడు. ''ఎలాగైనా అమ్మని తీసికెళ్లి పట్నంలో వైద్యుడికి చూపించి, మంచి మందులు ఇప్పించ మనేదే'' అందులోని సారాంశం!

రాంబాబు జవాబు కోసమే తను ఇంతకాలం ఎదురుచూసింది! నెల రోజులు గడిచినా మనిషి గానీ మాటగానీ రాలేదు.

బస్సు వేగంతో పాటు తన ఆలోచన్లూ అలా అలా సాగిపోతున్నాయి..

★ ★ ★

పట్నం బస్టాండ్‌లో బస్సు దిగిన రాజయ్య... బయటకు వచ్చి చుట్టూరా చూశాడు. పిచ్చి పట్టిన కుక్కల్లాగా అటూ ఇటూ పరుగెత్తు తోన్న వాహనాలను చూస్తూ అట్లాగే నిల్చుండి పోయాడు.

అంతలో ఒక ఆటోవాలా అతని పక్కనే ఆపి, ''ఏంటి పెద్దాయనా ఎక్కడికి పోవాలేంటి?'' అని అడిగాడు.

వెంటనే.. రాజయ్య తన చొక్కా జేబులోంచి ఒక కాగితం తీసి ఆటోవాలాకి చూపుతూ, ''ఈ అడ్రస్‌కి వెళ్లాలి. తీసుకెళ్తావా?'' అని అడిగాడు.

అడ్రసు చూసి ''అలాగే... ఇరవై రూపాయల వుతుంది'' అన్నాడు.

''అమ్మో.. అంతవుద్దా! పదయిదు ఇస్తా'' అన్నాడు రాజయ్య బేరం చేస్తూ.

''సరే... ఎక్కు!'' అన్నాడు ఆటో వాలా. రాజయ్య ఎక్కి కూర్చున్నాడు.

బేరం చేసి ఐదు రూపాయలు మిగిలిం చానని రాజయ్య తనలో తాను మురిసి పోగా, ఫక్తు పల్లెటూరి కేసులాగుంది. ఎదురు సందులో ఆఫీసు పెట్టుకొని ఆటో ఎక్కాడు! మంచి గిరాకీ తగిలిం దని ఈల వేసుకుంటూ, అటూ ఇటూ రెండు సందులు తిప్పి, ఆఫీసు వాకిట్లో ఆపి ''అదే పెద్దాయనా ఆఫీసు'' అన్నాడు ఆటోవాలా.

ఆటోవాలాకి డబ్బులిచ్చి, లోపలకు నడిచాడు రాజయ్య.

అక్కడ మెడలో బిళ్ల వేసుకొన్న బంట్రోతు కనిపించగానే, ''బాబూ! ఈ ఆఫీసులో రాంబాబు అనే ఆయన..'' అంటూండగానే,

''ఎవరూ ఆఫీసరు సారా! అలా కూర్చో... పంపిస్తాను'' అన్నాడు.

ఎదురుగా బల్లమీద కూర్చున్నాడు.

పది నిమిషాల తర్వాత బంట్రోతు ''ఇదిగో పెద్దాయనా... ఆ గదిలోకెళ్లు'' అంటూ తలుపు తీసి లోపలకు పంపించాడు.

గదిలోకి అడుగుపెట్టి, ఎదురుగా కుర్చీలో ఠీవిగా కూర్చునున్న రాంబాబుని చూడగానే రాజయ్యలో ఎక్కడ లేని ఆనందం ముంచుకొచ్చింది.

ఆప్యాయంగా ముందుకు కదిలాడు. అదే క్షణంలో... తన గదిలోకి ప్రవేశించిన తండ్రిని చూడగానే రాంబాబులో ఆందోళన మొదలైంది.

మాసినగడ్డం, చిరిగిన చొక్కా, నాటురకం పంచెతో లోపలకు వస్తూన్న తండ్రిని చూడగానే రాంబాబుకి చికాకు వేసింది.

సమయానికి తన గదిలో ఎవరూ లేకపోవటం అదృష్టంగా భావించాడు.

''నువ్వెందుకొచ్చావిక్కడికి. కబురు చేస్తే నేనే వచ్చి మాట్లాడే వాడినిగా! అదిగో ఆ పక్కన గదిలో కూర్చో. నేను వెళ్లేటప్పుడు ఇంటికి తీసుకెళతాను. ఇప్పుడు నాకు చాలా అర్జెంటు పనులున్నాయి'' అని బెల్‌కొట్టి బంట్రోతుని పిలిచి, ''ఈయన్ని ఆ గదిలో కూర్చోబెట్టు'' అని చెప్పి, ఫైల్లో దూరిపోయాడు.

బంట్రోతు చెప్పిన గదిలోకెళ్లి కూర్చు న్నాడు రాజయ్య.

ప్రయాణం చేసిన బడలికతో అలా కుర్చీ లోనే మగతలోకి జారిపోయాడు.

అలా మగతలోనున్న రాజయ్యకి లీలగా మాటలు వినిపించసాగాయి.



''డ్రైవర్! ఇదిగో ఈ గదిలోనున్న పెద్దాయన్ని అయ్యగారింట్లో వదిలి పెట్టు''

''ఎవరంట ఆ పెద్దాయన... అయ్యగారికి కావాల్సిన వాడా?''

''అయ్యగారి ఊర్లో వాళ్ల పొలం చూసే పాలే రట! ఏదో పని మీద పట్నం వచ్చాడట! ఇంటికి పంపించమని చెప్పాడు''

రాజయ్యకి మత్తు వదిలింది. గుండె భగభగ మండింది. సాయం లేకపోతే పోనీ కనీసం కన్న తండ్రిని... తండ్రిగా చెప్పుకోలేని రాంబాబుకు సంస్కారం మనసుని గాయపరిచింది. తను పాలేరు!

''పెద్దాయనా! రండి... ఇంటి దగ్గర దిగబెడ తాను'' పిలిచాడు డ్రైవరు.

## మారిన లుక్!

**తారల లుక్స్ మారిపోతూ ఉంటాయి. అలా మారుతుంటేనే వారి గురించి జనం ఆలోచి స్తారు. ఇకనుంచి తన మేకప్ తనే వేసుకోవాలను కుంటోంది మనీషా కొయిరాలా. తన మేకప్‌లో కళ్లకి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని చెప్పే మనీషా విదేశాలకి వెళ్లినప్పుడు కొత్త కొత్త మేకప్ సామాగ్రి కూడా తెచ్చుకుందిట. ఇదిలా ఉంటే రియాసేన్, మనీషా ఇప్పుడు బెస్ట్ ఫ్రెండ్స్ అయి పోయారట. సినిమాల గురించి, సరదా కబుర్ల గురించి వీరిద్దరూ తెగ చర్చించుకుంటున్నారట.**

''మీ అయ్యగారెక్కడ?''

''పక్క పల్లెలోని సమావేశంలో దిక్కులేని వ్యవసాయ కూలీలకు పింఛన్లు ఇవ్వటానికి వెళ్లారు'' అని చెప్పాడు.

రాజయ్య లేచి బంట్రోతునడిగి కాగితం, పెన్ తీసుకున్నాడు. అందులో ''బాబూ రాంబాబుగారూ! నేను, నా భార్య అనాథ వ్యవసాయ కూలీలం. దయచేసి మాకు పెన్షన్ ఇప్పించండి. ఇట్లు రాజయ్య, నడిమిట్ట అగ్రహారం'' అని రాసి, కాగితం బంట్రోతుకిచ్చి, ''దీన్ని మీ అయ్యగారికివ్వు'' అంటూ బయటకు నడిచాడు రాజయ్య.. వెన కాలే బంట్రోతు పిలుస్తున్నా వినిపించు కోకుండా.